క్లుప్తంగా

హైస్కూల్‌లో ఆర్జేడీ తనిఖీలు



బాలికల నోట్ పుస్తకాలను పరిశీలిస్తున్న ఆర్జేడీ నాగమణి

సామర్లకోట: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలను ఆర్జేడీ నాగమణి శనివారం తనిఖీ చేశారు. శుక్రవారం ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ స్థానిక బాలికల హాస్టల్ తనిఖీ సమయంలో పాఠ్యపుస్తకాలను పాఠశాలలో వదలినట్టు చెప్పడంపై హెచ్ఎం మీనా మాధురి నుంచి ఆర్జేడీ వివరాలు సేకరించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలను, 8వ తరగతి విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌లను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించారు. పాఠశాలలో ఉన్న పుస్తకాలను పరిశీలించి హోమ్ వర్కు చేసిందీ లేనిది గమనించారు. ఎంఈఓ వై. శివరామకృష్ణయ్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం అక్రమ నిల్వలపై కేసు

సామర్లకోట: స్థానిక మనుగుల దిబ్బ ప్రాంతంలో అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ బియ్యంపై కేసు నమోదు చేసినట్టు సీఐ కె.దుర్గాప్రసాద్ శనివారం తెలిపారు. సివిల్ సప్లయ్స్ డిప్యూటీ తహసీల్దార్ మున్నంగి జోసెఫ్‌కిరణ్‌ఆనంద్ ఫిర్యాదు మేరకు ఆరు వేల కేజీల బియ్యం రెండు ప్రదేశాలల్లో నిల్వ చేసి చేసిన గూడ శ్రీనివాసరావుపై కేసు నమోదు చేశామన్నారు. ఈ బియ్యం విలువ సుమారు రూ.2.42 లక్షలు ఉంటుందని తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కొత్తపల్లి: మండలంలోని ఉప్పాడ శివారు కొత్తపట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న నేరేళ్లమ్మ తల్లి ఆలయానికి జనసేన పార్టీ పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాకినీడి శేషు కుమారి రూ.20 వేల విరాళం ఇచ్చారు. ఈ మొత్తాన్ని శనివారం ఆమె ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. కార్యక్రమంలో పట్టా శివ, దొడ్డి దుర్గాప్రసాద్, సూరాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

కొత్తపల్లి: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ భాస్కరరావు సూచించారు. మండలంలోని పొన్నాడ శివారు కోనపాపపేట జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం గృహాల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న కాలనీల్లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలను కల్పిస్తోందన్నారు. లబ్ధిదారులందరూ ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించాలన్నారు. ప్రభుత్వం అందించే సాయంతో పాటు మహిళా సంఘాల సభ్యులకు అదనంగా రుణాలు మంజూరు చేస్తున్నట్టు తెలిపారు. పలువురు రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పేకాడుతున్న ముగ్గురి అరెస్టు

జగ్గంపేట: మండలంలోని రామవరం గ్రామ శివారులో పేకాట శిబిరంపై శనివారం పోలీసులు దాడి చేశారు. పేకాడుతున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుంచి రూ.1990 స్వాధీనం చేసుకున్నట్టు జగ్గంపేట ఎస్సై విద్యాసాగర్ తెలిపారు. ఈ దాడుల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

ఏలేశ్వరం: పట్టణంలో ఆదివారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు ఏడీవీ ప్రసాద్ శనివారం తెలిపారు. స్థానిక కోనేటిబడి సమీపంలోని స్వర్గీయ షణ్ముఖరావు ఆసుపత్రిలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామన్నారు. రాజానగరం జీఎస్ఎల్ ఆసుపత్రి సిబ్బంది వైద్య పరీక్షలు చేస్తారని చెప్పారు. పట్టణ ప్రజలు ఈ వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలీసుల అదుపులో ఇద్దరు వ్యక్తులు

శంఖవరం: గ్రామంలో సెల్‌ఫోన్ల దొంగతనానికి పాల్పడుతున్న ఇద్దరు అనుమానితులను స్థానికులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వారి వద్ద నుంచి రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై అన్నవరం పోలీసులు విచారణ చేస్తున్నారు.

నేడు ఉచిత ఆరోగ్య పరీక్షలు

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురంలో ఆదివారం ఉదయం నుంచి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు విన్నకోట సురేష్ తెలిపారు. షుగర్, బీపీ పరీక్షలు చేయనున్నామని, మరిన్ని వివరాలకు 98664 11346 నంబరులో సంప్రదించాలన్నారు.

అంగన్‌వాడీ టీచర్‌కు సన్మానం

సామర్లకోట: అంగన్‌వాడీ టీచరు ఇత్తండిశెట్టి లక్ష్మి పదవీ విరమణ సందర్భంగా 31వ వార్డు మహిళలు, కౌన్సిలర్ ఆమెను సన్మానించారు. అనంతరం టీచరు పోస్టు ఖాళీ కావడంతో నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

18 ఏళ్ల లోపు వివాహం నేరం

కాకినాడ రూరల్: అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్ల లోపు వివాహం చేయడం నేరమని జిల్లా బాలల సంక్షేమ అధికారి సీహెచ్ వెంకట్రావు పేర్కొన్నారు. శేషాద్రి నగర్‌లో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బేటీ బచావో–బేటీ పఢావోలో భాగంగా అవగాహన కార్యక్రమం జరిగింది.

కుక్కలున్నాయ్.. పిక్కలు జాగ్రత్త

- గ్రామాల్లో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు
- మహిళలు, పిల్లలపై దాడులు
- ఆందోళన చెందుతున్న ప్రజలు



కొత్తపల్లిలో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

కొత్తపల్లి: నియోజకవర్గంలోని గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. పలు గ్రామాల్లో శునకాలు రాత్రి, పగలూ తేడా లేకుండా స్వైర విహారం చేస్తున్నాయి. గుంపులుగా తిరుగుతూ చిన్నపిల్లలు, మహిళలపై దాడులు చేస్తున్నారు. దీంతో ఇంటి నుంచి బయటకు ఒంటరిగా వెళ్లేందుకు పిల్లలు, మహిళలు భయపడుతున్నారు. పాదచారులతో పాటు ద్విచక్రవాహనాల వెంట పడి కుక్కలు దాడి చేస్తుండడంతో వాహనదారులు ఆస్పత్రి పాలవుతున్నారు.

విద్యార్థులపై దాడులు

మండలంలో ఉప్పాడ, కొత్తపల్లి, అమీనాబాదు, మూలపేట, కొండెవరం, కొమరగిరి, నాగులాపల్లి తదితర గ్రామాల్లో కుక్కల దాడిలో గాయపడే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులపై సైతం కుక్కలు దాడి చేసి పిక్కలు లాగేస్తున్నాయి. ప్రధాన కూడళ్లు, మాంసం దుకాణాలు, చేపల మార్కెట్‌లో శునకాల బెడద మరింత ఎక్కువగా ఉంది. మాంసం, చేపలు కొనుగోలు చేసి ప్లాస్టిక్ కవర్లలో పట్టుకెళ్లి వారి వెంట పడుతున్నాయి. వాహనాలను సైతం వెంబడించడంతో కుక్కల దాడి నుంచి రక్షించుకునే ప్రయత్నంలో వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

పీహెచ్‌సీల్లో పెరుగుతున్న రోగులు

మండలంలోని కొత్తపల్లి, కొమరగిరి, నాగులాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గత నెలలో సుమారు 500 కుక్కకాటు కేసులు నమోదైనట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు కుక్కకాటుకు గురై వైద్యానికి వస్తున్నారని డాక్టర్లు చెబుతున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికారులు స్పందించి గ్రామాల్లో కుక్కల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నివారణ చర్యలు చేపట్టాలి

గుంపులుగా సంచరిస్తున్నాయి



గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ కుక్కలు గుంపులుగా సంచరిస్తున్నాయి. పిల్లలు, వృద్ధులపై దాడులు చేస్తున్నారు. పిల్లలను బయటకు పంపాలంటే భయపడుతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి కుక్కల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి.

రాపర్తి శ్రీను, వాకతిప్ప

ఇంటింటా పదింతల పర్యవేక్షణ

- విద్యార్థుల ఇళ్లకు వెళ్లి సందేహాల నివృత్తి
- చదువుపై దృష్టి పెట్టాలని హితవు



విద్యార్థినికి ఆమె ఇంటి వద్దే సందేహాలు నివృత్తి చేస్తున్న ఉపాధ్యాయులు

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు చదువుతున్న తీరుపై ఉపాధ్యాయులు నిత్యం వారి ఇళ్లకు వెళ్లి తనిఖీ చేస్తున్నారు. స్థానిక బచ్చు ఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శనివారం రాత్రి పదో తరగతి విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రుల నుంచి సమాచారం సేకరించారు. ఏప్రిల్ మూడు నుంచి పరీక్షలని, వారు చదువుపైనే దృష్టి పెట్టేలా చూడాలని సూచించారు. ఈ మేరకు విద్యార్థుల అనుమానాలను నివృత్తి చేశారు. ఈ ఏడాది నుంచి మారిన విధానం ప్రకారం ఆరు పేపర్లు మాత్రమే ఉంటాయని హెచ్ఎం తెలిపారు. ఇప్పటి కే సిలబస్ పూర్తి చేశామని, ప్రతి రోజు ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు చెప్తున్నట్టు ఉపాధ్యాయులు ఏఎల్‌వీ కుమారి, తాళ్లూరి వైకుంఠం వివరించారు.

అన్నదాన సమాజం దుకాణాల స్వాధీనం



దుకాణాలను స్వాధీనం చేసుకుంటున్న దేవదాయశాఖ అధికారులు

బోట్‌క్లబ్: స్థానిక మసీదు సెంటర్ సమీపంలో 18 నెలలుగా లీజు చెల్లించని కోకనాడ అన్నదాన సమాజానికి చెందిన రెండు దుకాణాలను శనివారం దేవదాయశాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆయా షాపులను గతంలో లీజు వేలం పాడుకున్న ఇద్దరు వ్యాపారులు సుమారు రూ.5 లక్షలు బాకీ పడ్డారు. దీంతో అధికారులు ట్రిబ్యునల్‌ను ఆశ్రయించి వారి ఆదేశాల మేరకు దుకాణాలను స్వాధీనం చేసుకున్నారు. సదరు వ్యాపారుల బ్యాంకు గ్యారెంటీలు రూ.2.5లక్షల చొప్పున ఉన్నాయని, ట్రిబ్యునల్ ఆదేశాల మేరకు ఈ షాపులకు త్వరలో లీజు వేలం నిర్వహిస్తామని కోకనాడ అన్నదాన సమాజం ఈఓ శివబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాదాయశాఖాధికారి పులి నారాయణమూర్తి, అన్నదాన సమాజం చైర్మన్ ముమ్మిడి శ్రీనివాసరావు, దేవాదాయశాఖ కాకినాడ ఇన్‌స్పెక్టర్ వడ్డి ఫణికుమార్, రెవిన్యూ, పోలీసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శృంగార వల్లభస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో శృంగార వల్లభస్వామి

పెద్దాపురం: శృంగార వల్లభ స్వామి దేవస్థానానికి శనివారం భక్తులు పోటెత్తారు. ప్రత్యేక దర్శనం టిక్కెట్ల ద్వారా రూ. 2,14,770, విరాళాల ద్వారా అన్నదానానికి రూ.49,310, కేశఖండన ద్వారా 7,400 వెరసి రూ.2,71,480 ఆదాయం సమకూరిందని ఈఓ పులి నారాయణమూర్తి తెలిపారు. ప్రజా ప్రతినిధులు కుంచే బుచ్చిరాజు, కర్రి జగదీష్, ఆలయ సిబ్బంది కృష్ణ, మోహన్‌రాజు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వామివార్లకు ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: మండలంలోని మూలపేటలో వేంచేసిన జగన్నాథస్వామి, సత్యనారాయణ స్వామి వార్ల కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామికి ఊంజల్ సేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: మండలంలోని కొండెవరంలో వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి దివ్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం స్వామివారిని పలు రకాల పూలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.

సంధికాలపు సతమతం



సామర్లకోటలో దాదాపు నిర్మానుష్యంగా ఉన్న ఫ్లైఓవర్

- మార్చిలోనే మండుతున్న ఎండలు
- తెల్లవారు జామున పొగ మంచు
- మధ్యాహ్నం విలవిల.. రాత్రికి గజగజ
- అల్లాడి పోతున్న ప్రజానీకం

సామర్లకోట: శీతాకాలం వెళ్తున్న, వేసవి వస్తున్న సంధికాలంలో రుతుచక్రం నడుస్తోంది. మార్చి నెల ప్రారంభంలోనే మధ్యాహ్న భానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. మరోవైపు రాత్రి వేళ శీతాకాలపు హిమపాతం నడి రుతువులా గజగజ వణికిస్తోంది. ఇదిలా ఉంటే ఏప్రిల్, మే నెలల్లో ఇంకెత వేసవి తాపాన్ని ఎదుర్కోవాలో అని ప్రజలు భయపడుతున్నారు. శనివారం తెల్లవారు జాము నుంచి 8 గంటల వరకు దట్టమైన పొగ మంచు కురియగా 10 గంటల నుంచి భానుడు తన ప్రభావాన్ని చూపాడు. దాంతో 36 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మార్చి 9 నుంచి పదో తరగతి విద్యార్థులకు ప్రీ పబ్లిక్, ఏప్రిల్ మూడు నుంచి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయి. తీవ్రమైన ఎండల్లో పిల్లలు పరీక్షలు ఎలా రాస్తారా అని తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఎండ వేడి తాళలేక ఫ్లైఓవర్ ఫుట్‌పాత్‌పైనే ట్రాఫిక్ కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తించాల్సి వస్తోంది.

కాకినాడ-అవనిగడ్డకు అల్ట్రా డీలక్స్

- రేపటి నుంచి ప్రారంభం
- ఆర్టీసీ డీఎం మనోహర్



కాకినాడ: కాకినాడ నుంచి అవనిగడ్డ వెళ్లేందుకు అల్ట్రా డీలక్స్ సరీ్వసును ఏర్పాటు చేశారు. ఈ విషయాన్ని స్థానిక డిపో మేనేజర్ ఎంయూవీ మనోహర్ శనివారం సాయంత్రం విలేకర్లకు తెలిపారు. కాకినాడ నుంచి యానాం, అమలాపురం, రాజోలు, నర్సాపురం, బంటుమిల్లి, పెడన, మచిలీపట్నం, చల్లపల్లి, మోపిదేవి మీదుగా అవనిగడ్డకు ఈ సర్వీస్ నడుస్తుందన్నారు. ఈ నెల ఆరో తేదీ ఉదయం నుంచి ఈ సర్వీస్ అమలులోకి వస్తుందన్నారు. ఉదయం 5 గంటలకు కాకినాడ నుంచి బయలుదేరే సర్వీసు మధ్యాహ్నం సుమారు 12.30 గంటలకు అవనిగడ్డ చేరుతుందన్నారు. అలాగే అవనిగడ్డలో మధ్యాహ్నం 1.45 గంటలకు బయలుదేరి రాత్రి 8.30 గంటలకు కాకినాడ చేరుకుంటుందన్నారు. ఈ సర్వీసుకు రిజర్వేషన్ సదుపాయం కూడా ఉందని, ఆన్‌లైన్‌లో కూడా టిక్కెట్లు అందుబాటులో ఉంటాయని ఆయన చెప్పారు.

విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలి



పిఠాపురంలో విద్యార్థినుల సమస్యలు తెలుసుకుంటున్న జడ్జి వసంతి

పిఠాపురం: విద్యార్థులకు పాఠశాల, వసతి గృహాల్లో మెరుగైన సౌకర్యాలను కల్పించడంతో పాటు వారి ఆరోగ్యం, నడవడికలపై దృష్టి పెట్టాలని జిల్లా 12వ సెషన్ కోర్టు జడ్జి ఎ.వసంతి అన్నారు. పిఠాపురంలోని బీఆర్ అంబేడ్కర్ గురుకుల జూనియర్ కళాశాల, పాఠశాలలు, గ్రంథాలయం, వసతి గృహాలను శనివారం ఆమె తనిఖీ చేశారు. విద్యార్థులతో వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని సూచించారు.

అక్రమ లేఅవుట్‌లో సరిహద్దు రాళ్లు తొలగింపు

గోకవరం: గ్రామ శివారున కోట్నీస్ ఆస్పత్రి సమీపంలో ఎటువంటి అనుమతులు లేకుండా వేసిన అక్రమ లేఅవుట్‌లో సరిహద్దు రాళ్లను శనివారం పంచాయతీ అధికారులు తొలగించారు. పంచాయతీ కార్యదర్శి టంకాల శ్రీనివాసరావు సిబ్బందితో కలిసి లేఅవుట్‌లో ఉన్న రాళ్లను తొలగించారు. ఈ సందర్భంగా కార్యదర్శి మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా లేఅవుట్‌ను వేయడంతో పంచాయతీ ఆధ్వర్యంలో రాళ్లను తొలగించామన్నారు. పంచాయతీ పరిధిలో అక్రమ లేఅవుట్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పొలంబడితో రైతులకు మేలు

వ్యవసాయ శాఖ జేడీ విజయకుమార్



పొలంబడిపై అవగాహన కల్పిస్తున్న జేడీ విజయకుమార్

సామర్లకోట: డాక్టర్ వైఎస్సార్ పొలంబడితో రైతులకు ఎంతో మేలని జేడీ ఎస్.విజయకుమార్ అన్నారు. స్థానిక వ్యవసాయ క్షేత్రంలో పెదపూడి, కాకినాడ రూరల్, సామర్లకోట మండల పరిధి ఆర్బీకే వ్యవసాయ సహాయకులకు శనివారం సాయంత్రం నిర్వహించిన పొలంబడిలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని నిత్యం ఉదయమే పొలంలోకి వెళ్లేలా చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని అన్నారు. ఆ సమయంలోనే పొలానికి మేలు చేసే, కీడు చేసే పురుగులను గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. ఇక్కడ నేర్చుకున్న అంశాలను రైతులకు వివరించాలని వ్యవసాయ సహాయకులకు ఆయన సూచించారు. ఏడీఏ జీవీ పద్మశ్రీ, వ్యవసాయాధికారులు ఐ.సత్య, సీహెచ్ సత్యనారాయణ, టీవీఆర్ మణిదీప్, సబ్ డివిజన్ మేనేజరు ఎంకేవీ లక్ష్మి, ఏఈఓలు, వీఏఏలు పాల్గొన్నారు.

భద్రత అందరి బాధ్యత

- రాక్ సిరామిక్స్ ఆపరేషన్స్ హెడ్ మహాపాత్ర
- కర్మాగారంలో జాతీయ భద్రత వారోత్సవాలు



రాక్ సిరామిక్స్‌లో భద్రతా ప్రతిజ్ఞ చేస్తున్న ఫ్యాక్టరీ అధికారులు కార్మికులు

సామర్లకోట: భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని రాక్ సిరామిక్స్ ప్లాంట్ ఆపరేషన్స్ హెడ్ శాశ్వత్‌కుమార్ మహాపాత్ర అన్నారు. 52వ జాతీయ భద్రత వారోత్సవాలను శనివారం రాక్ సిరామిక్స్‌లో ఆయన ప్రారంభించారు. కర్మాగారాలల్లో ఎల్లప్పుడూ భద్రత నియమాలు పాటించాలని ఆయన సూచించి భద్రతా ప్రతిజ్ఞ చేయించారు. హెడ్ సప్లయ్ చైన్ మేనేజ్‌మెంట్ రాజేంద్రసింగ్ మాన్ మాట్లాడుతూ కార్మికులు ద్విచక్ర వాహనం నడిపితే హెల్మెట్, కార్లు నడిపితే సీట్‌బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. సేఫ్టీ మేనేజర్ పి.బాలాజీ మాట్లాడుతూ ఫ్యాక్టరీలో వారం రోజుల పాటు భద్రతకు సంబంధించి వివిధ పోటీలు నిర్వహించనున్నామని, ప్రతి ఒక్కరూ పోటీలను విజయవంతం చేయాలన్నారు. టైల్స్ డీజీఎం వినోద్, సానిటరీ వేర్ హెడ్ రాఘవరావు, అకౌంట్స్ హెడ్ నటరాజ్, పీఆర్వో వీజీఎస్ కుమార్ పాల్గొన్నారు.

మహిళా హక్కులను సద్వినియోగం చేసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న అడిషనల్ జూనియర్ జడ్జి బుల్లెమ్మ

పెద్దాపురం: మహిళా హక్కులను సద్వినియోగం చేసుకోవాలని పెద్దాపురం కోర్టు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి.హర్షవర్ధన కోరారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. లోక్ అదాలత్ ద్వారా మహిళలు న్యాయం పొందే విధానం, గృహ హింస చట్టం తదితర మహిళా చట్టాల గురించి వివరించారు. మున్సిపల్ కమిషనర్ సురేంద్ర అధ్యక్షతన జరిగిన ఈ సభలో అడిషనల్ జూనియర్ జడ్జి జి.బుల్లెమ్మ మాట్లాడుతూ మహిళా హక్కులు, మహిళా చట్టాలను వివరించారు. మండల లీగల్ సర్వీస్ కమిటీ న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పీఠం కళా సేవ అభినందనీయం



దాడి చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న సేవాపీఠం వ్యవస్థాపక అధ్యక్షుడు శాస్త్రి తదితరులు

కాకినాడ కల్చరల్: శాస్త్రి సేవా పీఠం చేస్తున్న కళా సేవ అభినందనీయమని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.పద్మనాభం అన్నారు. స్థానిక రాజారామ్మోహన్‌రాయ్ వీధిలోని కాకినాడ పెన్షనర్స్ భవనం మొదటి అంతస్తులో కళాపీఠం ఆధ్వర్యంలో శాస్త్రి కళా ప్రాంగణం (సాహితీ, కళారంగాల ఐక్యవేదిక)ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు అస్వాదన సాహితీ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు జీవీఎస్ నరసింహమూర్తి అధ్యక్షత వహించారు. ఔత్సాహిక కళాకారులకు మరింత ప్రోత్సాహం అందజేసేందుకు ఈ కళా ప్రాంగణం ఏర్పాటు చేసినట్టు పీఠం వ్యవస్థాపకుడు పీఎస్ఎస్ఎన్‌పీ శాస్త్రి అన్నారు. వక్తలు పీఠం సేవలను కొనియాడారు. అనంతరం కళా రంగాలకు విశిష్ట సేవలు అందజేస్తున్న సీతారామరాజు స్మారక కళావేదిక వ్యవస్థాపకుడు పంపన దయానంద బాబును, వ్యక్తిత్వ వికాసం సంస్థ వ్యవస్థాపకులు అద్దేపల్లి ఉదయభాస్కర్‌ను, డీసీ, యూట్యూబ్ చానల్, సాహిత్య, సాంస్కృతిక, కళారంగాల ప్రోత్సాహ వేదిక వ్యవస్థాపకులు దాడి చంద్రశేఖర్‌లను సత్కరించి పురస్కారాలు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో సాహితీ స్రవంతి నగరశాఖ అధ్యక్షుడు మార్ని జానకిరామ్‌చౌదరి, తురగా సూర్యారావు, పద్మజావాణి, కాటంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయండి

- కమిషనర్ నాగనరసింహారావు
- ప్రత్యేక అధికారులతో సమీక్ష



గృహనిర్మాణ ప్రగతిని సమీక్షిస్తున్న కమిషనర్ నాగనరసింహారావు

కాకినాడ: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో ఇళ్ల నిర్మాణంలో మరింత వేగం పెంచాలని నగర పాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కార్పొరేషన్ కార్యాలయంలో నగర పాలక సంస్థ, హౌసింగ్ ప్రత్యేక అధికారులతో గృహ నిర్మాణ ప్రగతిపై సమీక్షించారు. కొమరగిరి లే అవుట్‌లో పెద్ద ఎత్తున ఇళ్లు నిర్మిస్తున్నందున డిమాండ్‌కు తగ్గట్టు ఇటుకలు సరఫరా చేయాలని ఆదేశించారు. ఇప్పటికే అక్కడ ఇటుకల పరిశ్రమ అందుబాటులో ఉన్నప్పటికీ డిమాండ్ మేరకు బ్రిక్ ఇండస్ట్రీలను సంప్రదించాలని సూచించారు. ఏ దశలోను నిర్మాణాలు మందగించకుండా చూడాలన్నారు. అలాగే లబ్ధిదారులైన స్వయం సహాయక సంఘాల సభ్యులు సుమారు 4వేల మందికి రూ.35 వేల బ్యాంకు లింకేజీ అందాల్సి ఉందని, దీనిపైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఇంకా అగ్రిమెంట్లు చేసుకోని లబ్ధిదారులను స్వయంగా కలసి ఇంటి నిర్మాణ ప్రగతిని, భవిష్యత్‌లో ఆ ప్రాంతం మరో టౌన్‌షిప్‌గా అభివృద్ధి చెందబోతున్న అంశాన్ని వివరించి ప్రోత్సహించాలని సూచించారు. అలాగే కాంట్రాక్టర్ల బిల్లులు ఎప్పటికప్పుడు పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. సమావేశంలో గృహనిర్మాణశాఖ ఈఈ గుప్త, డిప్యూటీ కమిషనర్ కోన శ్రీనివాస్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, టీపీఆర్వో మానే కృష్ణమోహన్, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



తమ్మయ్యపేటలో బాధితులకు నిత్యావసరాలు, ఆర్థిక సాయం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

తొండంగి: మండలంలోని బెండపూడి పంచాయతీ తమ్మయ్యపేటలో అగ్ని ప్రమాద బాధితులకు వైఎస్సార్ సీపీ నాయకులు శనివారం ఆర్థిక సాయం, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఇటీవల తమ్మయ్యపేట గ్రామానికి చెందిన చింతల రాంబాబు ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో కాలిపోయింది. దీంతో మండల వ్యవసాయ సలహామండలి చైర్మన్ మద్దుకూరి వీరవెంకటసత్యనారాయణ(పెద్దబ్బు), వైఎస్సార్ సీపీ మండల యూత్ కన్వీనర్ ఆరుమిల్లి ఏసుబాబు, పార్టీనాయకులు శనివారం బాధితులకు రూ.12 వేలు, 100 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏలేటి ధర్మరాజు, ఎంపీటీసీలు మళ్ల సురేష్, గొంతెన నాగేశ్వరరావు, బూసాల గణపతి, సోమిశెట్టి చలపతి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని బురదకోటలో అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు శనివారం తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ నిత్యావసర వస్తువులు అందజేశారు. బురదకోటలో ముర్ల సత్యవతి, మాడెం కృష్ణకుమారిలకు చెందిన తాటాకిళ్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతయ్యాయి. దీంతో తహసీల్దార్ గోపాలకృష్ణ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. బాధిత కుటుంబాలకు నిత్యావసర సరకులు అందజేశారు. బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో వీఆర్వో ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి సాయం అందజేత

ఏలేశ్వరం: పట్టణంలోని అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి శనివారం దాత సాయం అందజేశారు. స్థానిక చైతన్య నగర్‌లో ఎస్.వెంకటలక్ష్మికి చెందిన తాటాకిల్లు ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. దీంతో పారుపాక మాజీ సర్పంచ్ గాడినూకరాజు బాధితురాలికి బియ్యం, దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో గాడి మహేష్ తదితరులు పాల్గొన్నారు.